# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-12-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు పర్యటిస్తారు.**

**2.** **అమరావతి నిర్మాణ ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**

**3.** **హైదరాబాద్ విశ్వనగరంగా మారేందుకు బాహ్యవలయ రహదారి–ఓఆర్ఆర్ దోహదపడిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు.**

**4.** **ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ ఈరోజు పర్యటిస్తారు.**

**5.** **తెలంగాణలో పదవ తరగతి పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్నాయి.**

=========================

కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని గంగూరు, ఈడ్పుగల్లులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటిస్తారు. పర్యటనలో భాగంగా గంగూరులో జరిగే రెవెన్యూ సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఈడ్పుగల్లులో స్థానిక రైతు సేవా కేంద్రంలో ధాన్యం సేకరణను పరిశీలిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి రైతులతో ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు.

-------------------------

అమరావతి నిర్మాణ ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని ఆంధ్రప్రదేశ్ సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం మంత్రి మండలి నిర్ణయాలను మంత్రి పార్థసారథి పాత్రికేయులకు వివరించారు.

వాయిస్ ( 36 సెకన్లు)

అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు, పది జిల్లాల్లోని వరద ప్రాంతాల్లో రుణాల రీషెడ్యూల్, 1.70 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి వివరించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సొసైటీ ఫర్ ఎంప్లాయ్ మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ ప్రైజ్ డెవలప్ మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్– సీడాప్ నిన్న మంత్రి సమక్షంలో 3 ప్రధాన సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. అనంతరం నారా లోకేష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు సీడాప్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. యువతకు విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేలా అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు సీడాప్ ముందుకు రావడం అభినందనీయమని మంత్రి తెలిపారు.

---------------------------

హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందేందుకు బాహ్యవలయ రహదారి–ఓఆర్ఆర్ దోహదపడిందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా నిన్న ఓఆర్ఆర్ పై జరిగిన చర్చలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఔటర్ రింగు రోడ్డు టెండర్లపై విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. ఓఆర్ఆర్ పై విచారణ జరిపేందుకు ప్రత్యేక విచారణ బృందం– సిట్ ను ఏర్పాటు చేస్తామని, త్వరలోనే విధివిధానాలు ప్రకటిస్తామని రేవంత్ రెడ్డి పేర్కొంటూ,

వాయిస్ ( 37 సెకన్లు)

---------------------------

క్రీడాకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. విజయవాడలో క్రీడా యాప్‌ను, రాష్ట్ర క్రీడా విధానాన్ని మంత్రి నిన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతతో క్రీడారంగంలో నూతన ఆవిష్కరణలకు కూటమి ప్రభుత్వం అంకురార్పణ చేసిందన్నారు. అమరావతి కేంద్రంగా 2027 లో జాతీయ క్రీడా పోటీలు నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ... 32 సెకన్లు

---------------------------

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ ఈరోజు పర్యటిస్తారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో ఈరోజు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఉపాధి హామీ పథకం క్రింద మక్కువ మండలం బాగుజోల గ్రామం నుండి సాలూరు మండలం సిరివర గ్రామం వరకు 9.50 కోట్ల రూపాయల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. రేపు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అనంతగిరి మండలంలో పర్యటించి, గిరిజనులతో సంభాషిస్తారు. ఏజెన్సీలో పలుచోట్ల రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు జలజీవన్ మిషన్ పనులను పరిశీలిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

తెలంగాణలో పదవ తరగతి పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. వచ్చే ఏడాది మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు సెకండరీ స్కూల్ సర్టిఫికేట్ –ఎస్ఎస్‌సీ బోర్డు షెడ్యూల్‌ను ప్రకటించింది. మార్చి 21న మొదటి భాష , 22న ద్వితీయ భాష, 24న ఆంగ్లం, 26న

గణితం, 28న బౌతిక శాస్త్రం, 29న జీవశాస్త్రం, ఏప్రిల్ 2న సాంఘిక శాస్త్రం పరీక్షలు జరగనున్నాయి. ఏప్రిల్ 3న ఒకేషనల్ కోర్సు పేపర్-1 భాషా పరీక్ష, 4న ఒకేషనల్ కోర్సు పేపర్-2 భాషా పరీక్ష జరగనుంది.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతోందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో అనంతపురం జిల్లా స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు, నాయకులతో నిన్న జగన్ మోహన్ రెడ్డి సమావేశమైయ్యారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ,

వాయిస్ ..31 సెకన్లు

-------------------------

వినోద రంగంలో ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వేవ్స్ కార్యక్రమాన్ని నిర్వహించనుందని పత్రికా సమాచార కార్యాలయం అదనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి తెలిపారు.గుంటూరు జిల్లా లాంఫారంలోని స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో వేవ్స్ సదస్సుపై నిన్న నిర్వహించిన కార్యశాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర చౌదరి మాట్లాడుతూ, వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నుండి 9 వరకు ఢిల్లీలోని భారత మండపంలో ఈ సదస్సు జరగనుందని చెప్పారు. షార్ట్ ఫిలిమ్స్, యానిమేషన్ వంటి అంశాలపై జరిగే పోటీలలో యువత పాల్గొనవచ్చని తెలిపారు.

-------------------------

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనంగా వాయవ్య దిశగా పయనిస్తూ ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా తీరం వైపు ప్రయాణించనుందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఈరోజు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో భారీ వర్షాలు కురిస్తాయని తెలిపింది. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో తీరం వెంబడి గంటకు గరిష్ఠంగా 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో ఆదివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

తెలంగాణలోనూ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================